# నాన్నా... నే చదువుకుంటా!

– డి.కె. చదువులబాబు



మానవ సంబంధాలన్నీ డబ్బు చుట్టూ తిరుగుతుంటాయి. ప్రేమ, అనురాగం, ఆప్యాయత లాంటి వేల వేల బంధాలు డబ్బు ముందు తీసికట్టే అనే నిజం అర్థమైన ఆ క్షణం నా హృదయం చితికిపోయింది.

నేను ప్రస్తుతం వున్న గ్రామానికి దగ్గరలో ఓ చిన్న పల్లెలో నాకు టీచర్ పోస్టు వచ్చింది. బడిచుట్టూ అందమైన పంట పొలాలు, పచ్చని చెట్లు, సుతారంగా వీచే చల్లగాలి, టోటల్‌గా వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

కొత్తసారొచ్చాడనే వార్త ఊరంతా గుప్పుమంది. బడి చుట్టూ జనం మూగారు. వచ్చిన వారిని పరిచయం చేసుకున్నాను. పిల్లల్ని పంపించమని చెప్పాను. కొద్దిసేపటికి పిల్లలు బిలబిలా వచ్చారు. అప్పుడే రెక్కలు విప్పిన పిట్టల్లా, రేకులు విచ్చిన పువ్వుల్లా వున్నారు.

ఓబులేసును స్కూలు లీడరుగా నియమించాను. ఇక్కడ ఓబులేసు గురించి నాలుగు మాటలు చెప్పాలి. వాడీ సంవత్సరం ఐదవతరగతి. చాలా చలాకీగా వుంటాడు. అందరికీ తలలో నాలుకలా వుంటాడు. చదువులో, ఆట, పాటల్లో వాడే ఫస్ట్. అందంగా బొమ్మలు గీస్తాడు. ప్రతి విషయంపట్ల కుతూహలం, శ్రద్ధ చూపుతూ ఉత్సాహంగా నేర్చుకునేవాడు. ఒక్కసారి చెబితేచాలు ఇట్టే పట్టేసేవాడు. వాడికి చదువుమీద ఉన్న శ్రద్ధ ఇంతా అని చెప్పనలవి కాదు. వాడి ఆసక్తికి, ఉత్సాహానికీ లిపిలేదు.

ఇలాంటి పిల్లలపట్ల ఏ ఉపాధ్యాయుడికైనా ప్రత్యేక అభిమానం ఉంటుంది. అలాంటి అభిమానమే వాడిపట్ల నాకూ ఏర్పడింది. చూస్తుండగానే దసరా సెలవులు దగ్గరపడ్డాయి. సెలవులు రాబోతున్నాయనే విషయం పిల్లలు ముందే పసికట్టారు. సెలవులకు ముందురోజు పిల్లలు ఉత్సాహం చెప్పనలవికాలేదు.

''సెలవులెన్ని రోజులు సార్?'' అడగనే అడిగాడు ఓబులేసు.

పంద్రెండు రోజులని చెప్పాను. బడి అంతా వసపిట్టల కబుర్లతో మార్మోగింది. స్వేచ్ఛగా సీతాకోక చిలుకల్లా ఉన్నారు.

కాలం పరుగులో సెలవులు పూర్తయ్యాయి. బడికెళ్ళాను. మొదటిరోజు కావటంతో పిల్లలు ఆలస్యంగా వచ్చారు. బడి శుభ్రంచేసి కూర్చున్నారు. ఆరుగురు పిల్లలు పట్నానికెళ్ళినట్లు సమాధానం వచ్చింది. ఆశ్చర్యంగా పిల్లలవైపు చూసి ''ఎందుకెళ్ళార్రా! వాళ్ళ చుట్టాలున్నారా?'' అని అడిగాను.

''ఇక బడికిరారు సార్. పనికోసం వెళ్ళారు'' చెప్పారు పిల్లలు ముక్తకంఠంతో.

వెంటనే వాళ్ళ పెద్దవాళ్ళని పిల్చుకురమ్మని సురేంద్రను పంపాను. నాకు విషయమేంటో తెల్సుకోవాలని చాలా టెన్షన్‌గా వుంది. అరగంట తర్వాత ఓబులేసు నాన్న వెంకటేశంతో కలిసి అందరూ వచ్చారు.

''మీ పిల్లల్ని చదువుమాన్పించి, ఎక్కడికంపారు?'' అడిగాను. ''పనికోసం పిల్లోల్లు కావాలని పట్నం నుండి తెలిసిన మనిషి వచ్చాడుసార్! మూడు పూటలా అన్నంపెట్టి, నెలకు నాల్గొందలిస్తారట. పిల్లల్ని బాగా చూసుకుంటారట. ఐదొందల రూపాయలు ముందే ఇచ్చాడు..'' చెబుతున్నాడు వెంకటేశం.

నా హృదయం ఒణికింది. ఒళ్ళు జలదరించింది. భూమి గిర్రున తిరుగుతున్నట్లనిపించింది.

నవ్వులతో, కేరింతలతో, ఆడుతూ, పాడుతూ, గలగలా చదువుతూ, ఓ అద్భుత, ఆనందమైన ప్రపంచంలో విహరించే పిల్లలు కళ్ళముందు మెదిలారు.

''వాళ్ళది చదువుకోవలసిన వయస్సు. దళారీల వెంట పనులకు పంపిస్తే చదువెలా వస్తుంది? వారి జీవితాలేమవుతాయి?'' అన్నాను కోపం అణుచుకుంటూ.

వారిని కూర్చోమని ఓగంట క్లాస్ తీసుకున్నాను. ఎన్నో విధాలుగా చెప్పాను. పిల్లలు సంపాదించబోయే డబ్బు తప్ప వారినోట మరోమాట రాలేదు. నాప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరయింది. వారికి చెప్పటం గోడకు చెప్పటమేనని అర్థమయింది. నామాటలు వారికి చెవుల్లో సీసం పోసినట్లయింది.

''ఇదిగో మాష్టారూ! మీపనేదో మీరు చూసుకోండి. మా కుటుంబ విషయాల్లో కల్పించుకుంటే బాగుండదు. ఎలా బ్రతకాలో మాకు తెలుసు'' అంటూ విసవిసా వెళ్ళిపోయారు.

మనసంతా వేదనతో.. చేదుమింగినట్లుంది. ఏపని చేస్తున్నా పిల్లలే కన్పించసాగారు. నెలరోజులు గడిచిపోయాయి. ఈ సంఘటన నుండి నేనింకా కోలుకోలేదు.

ఓరోజు మధ్యాహ్నం పరుగున వచ్చాడు వెంకటేశం. చేతికి ఉత్తరమిచ్చి ''ఏం రాసుందో చూడు సార్'' అన్నాడు.

అది చదివి నాగుండె నీరయింది. కన్నీరు చెంపలను తడిపేసింది. ఓబులేసు బరువులు మోస్తూ మేడమీద నుండి క్రిందపడటం వలన కుడికాలు పూర్తిగా దెబ్బతిని తీసేశారు. హాస్పిటల్‌లో వున్నాడు. వచ్చి తీసుకెళ్ళమని దళారి రాసిన ఉత్తరమది.

విషయం తెలియగానే వెంకటేశం గుండెలు బాదుకుంటూ బోరుమని ఏడ్చాడు. ఈ విషయం ఊరంతా గుప్పుమంది. తమ పిల్లలను తెచ్చుకోవటానికి వెంకటేశంతో కలిసి అందరూ రైలెక్కారు. వారి వెంట నేనూ వెళ్ళాను.

మొండికాలుతో, తలకు గాయాలతో మంచంలో పడుకుని వున్నాడు ఓబులేసు. వాడిని చూడగానే కడుపులో దేవినట్లయింది. వాడు దీనంగా నావైపు చూశాడు. వాడి కళ్ళనిండా నీళ్ళు.

''సార్! నాకు చదువుకోవాలనుంది సార్! బరువులు మోయలేను సార్. మా అయ్యకు మీరైనా చెప్పండిసార్'' అన్నాడు వెక్కి వెక్కి ఏడుస్తూ.

నా గుండె తరుక్కుపోయింది. అంతవరకూ బిగబట్టిన దుఃఖం కట్టలు తెంచుకుంది. నా కళ్ళు శ్రావణమేఘాల్లా వర్షించసాగాయి.

''నా అత్యాశ, సోమరితనం ఇంతపని చేస్తుందనుకోలేదురా! నన్ను క్షమించరా'' అంటూ వెంకటేశం, వాడి భార్య నెత్తీనోరూ బాదుకుంటూ భోరుమన్నారు. చేతులు కాలాక గానీ వారికర్థం కాలేదు.

''నిన్నెక్కడికీ వెళ్ళనివ్వనురా! నాదగ్గరే వుండి బాగా చదువుకుంటావు. నీకేం భయంలేదు. నేను నిన్నెప్పుడూ వదలనురా!'' అన్నాను కాలుపోగొట్టుకున్న వాడికి అద్భుతమైన, ఆనందమైన ప్రపంచాన్ని సృష్టించటానికి సిద్ధపడుతూ.

★